ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
ఆదివారం 31 ఆగస్టు 2025





## యాదగిరిగుట్ట ఆలయ ఈవోగా వెంకటరావు రీఅపాయింట్

### అదనంగా శిల్పరామం స్పెషల్ ఆఫీసర్ గా బాధ్యతలు



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఈవోగా ఐఏఎస్ అధికారి వెంకటరావు రీఅపాయింట్ అయ్యారు. దీనికి సంబంధించి ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. 2025 ఏప్రిల్ 30న ఎండోమెంట్ కమిషనర్, ఆలయ ఈవోగా వెంకటరావు బాధ్యతలు చేపట్టారు. కాగా శనివారంతో విధుల నుంచి రిటైర్డ్ కావాల్సి ఉండగా.. ప్రభుత్వం ఆయన పదవీ కాలాన్ని పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆలయ ఈవో బాధ్యతలతో పాటు అదనంగా శిల్పరామం ఆర్ట్స్, క్రాఫ్ట్స్, కల్చరల్ సొసైటీకి స్పెషల్ ఆఫీసర్ గా అపాయింట్ అయ్యారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు యాదగిరిగుట్ట ఆలయ ఈవోగా, శిల్పరామం స్పెషల్ ఆఫీసర్ గా విధుల్లో కొనసాగుతారని ప్రభుత్వం ఉత్తర్వులు పేర్కొంది.

## సెప్టెంబర్ 7న చంద్రగ్రహణం సందర్భంగా యాదగిరిగుట్ట టెంపుల్ బంద్

### 8న ఉదయం 3:30 గంటలకు గుడి తెరిచి సంప్రోక్షణ

### ఉదయం 8:15 గంటల నుండి దర్శనాలు పునరుద్ధరణ



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: సెప్టెంబర్ 7న సంపూర్ణ చంద్ర గ్రహణం సందర్భంగా.. మధ్యాహ్నం 12 గంటలకు యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం మూసివేయబడుతుందని ఆలయ ఈవో వెంకటరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకటనలో పేర్కొన్న వివరాల ప్రకారం.. యాదగిరిగుట్ట ఆలయంతో పాటు పాతగుట్ట, ఉప ఆలయాలు, అనుబంధ ఆలయాలు అన్ని మూసివేయనున్నారు. 7న రాత్రి 9:56 గంటలకు చంద్ర గ్రహణం ప్రారంభమై రాత్రి 1:26 గంటలకు ముగియనున్న నేపథ్యంలో.. అదే రోజు మధ్యాహ్నం లోపు స్వామివారికి నిత్య కైంకర్యాలు, నివేదన, దర్శనాలు ముగించి, మధ్యాహ్నం 12 గంటలకు ఆలయాన్ని మూసివేయనున్నారు. చంద్ర గ్రహణం ముగిసిన అనంతరం.. సోమవారం ఉదయం 3:30 గంటలకు తిరిగి ఆలయాన్ని తెరిచి సంప్రోక్షణ చేయనున్నారు. అనంతరం స్వామివారికి సుప్రభాతం, తిరువారాధన, బాలబోగం, నిజాభిషేకం, సహస్రనామార్చన చేపట్టి.. ఉదయం 8:15 గంటల నుండి అన్ని రకాల దర్శనాలు మొదలుపెట్టి భక్తులను అనుమతించనున్నారు. అదేవిధంగా రోజుకు 4 బ్యాచుల్లో నిర్వహించే సత్యనారాయణస్వామి వ్రతాలను.. 7న చంద్ర గ్రహణం సందర్భంగా రెండు బ్యాచులకు తగ్గించారు. ఉదయం 7 గంటలకు, ఉదయం 10 గంటలకు రెండు బ్యాచుల్లో మాత్రమే వ్రతాలు నిర్వహించి మిగతా రెండు బ్యాచులను రద్దు చేశారు. చంద్ర గ్రహణం సందర్భంగా మారిన టైమింగ్స్ ను దృష్టిలో పెట్టుకుని అందుకనుగుణంగా తమ షెడ్యూల్ ను మార్చుకుని ఆలయ అధికారులకు సహకరించాలని భక్తులకు సూచించారు.

## జనగామలో దొంగల హల్చల్....

### మహిళ మెడలో 4 తులాల గొలుసు అపహరణ



జనగామ, ఆగస్టు 30: (రోమింగ్ న్యూస్) జనగామలో శుక్రవారం సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో బంగారు చైన్స్ దొంగలు హల్చల్ సృష్టించారు. జనగామ జిల్లా కేంద్రంలో గిర్నిగడ్డ పాత భాష్మియా మిల్లు పక్కనే నివాసం గల సామి శెట్టి రవీందర్ భార్య శ్రీమతి భాగ్యలక్ష్మి మెడలో నుండి గుర్తు తెలియని వ్యక్తి నాలుగు తులాల బంగారు (పుస్తెలతాడు) మంగళ సూత్రాన్ని తెంచుకొని పరారయ్యాడు. గతంలో రైస్ మిల్ లో పార్టనర్ గా వ్యాపారం చేసిన సామిశెట్టి రవీందర్ తన భార్య భాగ్యలక్ష్మి (62) ఒంటరిగా ఇంటి బయట గేటు దగ్గర నిలబడిన సమయంలో దాదాపు 40 సంవత్సరాల వయసు గల వ్యక్తి ఫోన్ మాట్లాడుకుంటూ ఇంటిదగ్గర నిలబడి ఉండడం వెంటనే అతను వచ్చి తనను తోసేసి మెడలో ఉన్న పుస్తెలతాడు తెంపి, లాక్కొని మోటార్ బైక్ పై పరార్ అయినట్లు మీడియాతో పాటు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పిల్లలు విదేశాలలో ఉండగా ఇంట్లో భర్త లేని సమయంలో ఒంటరిగా ఉన్న మహిళను పసిగట్టి ఈ దొంగతనానికి పాల్పడినట్లు ఆ వీధి వారు చెప్తున్నారు. దాదాపు నాలుగు లక్షల రూపాయల విలువ చేసే బంగారు మంగళసూత్రం దొంగల పాలు కావడంతో మహిళలు బాధను వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల జనగామ జిల్లాలో తాళం వేసిన ఇండ్లలో దొంగతనాలు, అలాగే దేవుడి గుళ్ళలో హుండీలను దొంగలించడం ఇలా అనేక సంఘటనలు జరుగుతున్నాయి. ఏది ఏమైనా అనుమానితులను, ఇంట్లోకి రానీయకూడదని, అప్రమత్తంగా ఉంటూ అనుమానాలు ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం అందిస్తూ ఫిర్యాదు చేయాల్సిన బాధ్యత పౌరులపై ఉంది అన్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాలి. శుక్రవారం జరిగిన బంగారు గొలుసు అపహరణ కేసును నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ అపహరణకు సంబంధం ఉన్నట్లు భావిస్తున్న ఇద్దరు వ్యక్తులు మోటార్ బైక్ పై వెళ్తున్న ఫోటోను పోలీసులు మీడియాకు విడుదల చేశారు. ఫోటోలో ఉన్న అనుమానితుల వివరాలు తెలిసినవారు పోలీసులకు ఫిర్యాదు చేయాలి, వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుంది.

# వివక్ష రహిత సమాజం కోసం కృషి చేయాలి

### యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్:

మానవ విలువలు గుర్తుచేసుకుని వివక్ష రహిత సమాజ నిర్మాణం కోసం ఐక్యంగా కృషి చేయాలని యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు సూచించారు. 'సివిల్స్ రైట్స్ డే' సందర్భంగా యాదగిరిగుట్ట మండలం మాసాయిపేటలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి మనిషికి సమాన హక్కులు, స్వేచ్ఛను అనుభవించేందుకు అవకాశం కల్పించిన రోజే 'సివిల్స్ రైట్స్ డే' అని తెలిపారు. జాతి, వర్ణ, మతం, లింగ భేదాలకతీతంగా అందరూ సమానమేనని పేర్కొన్నారు. గ్రామంలో పిల్లలందరూ విద్య అభ్యసించే విధంగా చూడాలని సూచించారు. పలు సమస్యలపై ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం శానిటేషన్ సిబ్బందిని కలెక్టర్ శాలువాలు కప్పి సన్మానించారు. అనంతరం గ్రామస్తులు పలు రకాల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఎస్సీ కాలనీలో పర్యటించి శిథిలావస్థలో ఉన్న వాటర్ ట్యాంక్ ను వెంటనే తొలగించాలని ఆదేశించారు. తర్వాత గ్రామ ప్రజలు, అధికారులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అనంతరం గౌరాయపల్లిలోని పల్లె దవాఖానను ఆకస్మికంగా తనిఖీలు చేశారు. పల్లెల్లో నివసించే ప్రజలకు సకాలంలో వైద్యం అందించాలని ఆదేశించారు. వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదమున్న నేపథ్యంలో.. అన్ని రకాల మందులు స్టాక్ పెట్టుకుని, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు కళ్లెం జహంగీర్ గౌడ్, తహశీల్దార్ గణేష్ నాయక్, ఎంపీడీవో నవీన్ కుమార్, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు సత్యప్రకాశ్ గౌడ్, మాజీ వార్డ్ సభ్యుడు వినోద్, విలేజ్ సెక్రటరీ నరేష్, కారోబార్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# నర్సన్న క్షేత్రంలో 'గరుడ ట్రస్ట్' సేవలు

### గరుడ ట్రస్ట్ విధివిధానాలు విడుదల చేసిన దేవస్థానం

### గరుడ ట్రస్ట్ కు మూడు కేటగిరీల్లో విరాళాల స్వీకరణ

### బ్రేక్, స్పెషల్ దర్శనంతో పాటు అభిషేకం లడ్డూ, శేషవస్త్రాలు అందజేత

### దాతలకు జీవితకాలం బ్రేక్, స్పెషల్ దర్శన సదుపాయం



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: భక్తులకు మెరుగైన సౌకర్యార్థం తిరుమల తిరుపతి దేవస్థానంలో ఉన్న శ్రీవాణి ట్రస్ట్ తరహాలో యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఇటీవల అందుబాటులో తెచ్చిన 'గరుడ ట్రస్ట్' స్కీంకు ఆలయ అధికారులు విధివిధానాలు ఖరారు చేశారు. గరుడ ట్రస్ట్ స్కీంకు రూపొందించిన విధివిధానాలకు సంబంధించి దేవస్థానం శనివారం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు. గరుడ ట్రస్ట్ స్కీంకు భక్తులు ఇచ్చే విరాళాలు ప్రత్యేక బ్యాంక్ అకౌంట్ లో జమ కానున్నాయి. విరాళాల ద్వారా సమకూరిన సొమ్మును విద్య, వైద్యం, ప్రసాద వితరణ మాత్రమే ఉయోగించనున్నట్లు ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్నారు. విరాళం ఇచ్చిన భక్తులకు బ్రేక్ దర్శనం, ప్రత్యేక దర్శన సదుపాయంతో పాటు అభిషేకం లడ్డూప్రసాదం, స్వామివారి శేషవస్త్రాలు(కల్యాణ షెల్లా, కనుము) అందజేయనున్నారు.

**గరుడ ట్రస్ట్ విరాళాలకు మూడు కేటగిరీలు**

భక్తులు ఇచ్చే విరాళాల స్వీకరణకు గరుడ ట్రస్ట్ స్కీంకు మూడు కేటగిరీలుగా విధివిధానాలు రూపొందించారు. రూ.50 వేలు, రూ.1 లక్ష, రూ.2 లక్షలుగా సపరేట్ కేటగిరీలు పెట్టారు. రూ.50 వేలు విరాళం ఇచ్చే భక్తులకు ఏడాదిలో రెండుసార్లు బ్రేక్ దర్శనం(ఆరుగురికి), స్పెషల్ దర్శనం(ఆరుగురికి) సదుపాయం లైఫ్ టైం ఉంటుంది. అదేవిధంగా రూ.1 లక్ష విరాళం ఇచ్చే భక్తులకు ఏడాదిలో నాలుగుసార్లు బ్రేక్ దర్శనం(ఆరుగురికి), స్పెషల్ దర్శనం(ఆరుగురికి) సదుపాయం లైఫ్ టైం ఉండనుంది. అలాగే రూ.2 లక్షల విరాళం ఇచ్చే భక్తులకు ఏడాదిలో ఎనిమిదిసార్లు బ్రేక్ దర్శనం(ఆరుగురికి), స్పెషల్ దర్శనం(ఆరుగురికి) సదుపాయం లైఫ్ టైం ఉంటుంది. గరుడ ట్రస్ట్ స్కీంకు రూ.2 లక్షలు విరాళం ఇచ్చిన భక్తులకు బ్రేక్, స్పెషల్ దర్శనం, అభిషేకం లడ్డూప్రసాదం, శేషవస్త్రాలతో పాటు అదనంగా.. కొండ కింద యాదరుషి నిలయంలో(డబుల్ బెడ్రూం) వసతి సదుపాయం ఉంటుంది. రూ.50 వేలు, రూ.1 లక్ష విరాళం ఇచ్చిన భక్తులకు వసతి సదుపాయం ఉండదని, కేవలం రూ.2 లక్షలు విరాళం ఇచ్చిన భక్తులకు మాత్రమే అకామడేషన్ సౌకర్యం ఉండనుంది. ఇక విరాళం ఇచ్చిన భక్తులకు వసతి కూపన్లు, దర్శనం కూపన్లు అందజేసి బ్రేక్, స్పెషల్ దర్శనం కల్పించనున్నారు. అదేవిధంగా గరుడ ట్రస్ట్ కు విరాళం ఇచ్చిన భక్తులకు ప్రత్యేక బాండ్ కూడా ఇవ్వనున్నారు.

**గరుడ ట్రస్ట్ ను భక్తులు సద్వినియోగం చేసుకోవాలి - ఎండోమెంట్ డైరెక్టర్, ఆలయ ఈవో వెంకటరావు**

భక్తుల సౌకర్యార్థం ఆలయంలో నూతనంగా అందుబాటులోకి తెచ్చిన గరుడ ట్రస్ట్ స్కీంను భక్తులు సద్వినియోగం చేసుకోవాలి. గరుడ ట్రస్ట్ కు వచ్చిన విరాళాలను విద్య, వైద్యం, ప్రసాద వితరణకు మాత్రమే వినియోగిస్తాం. దాతలకు బ్రేక్, స్పెషల్ దర్శనంతో పాటు అభిషేకం లడ్డూప్రసాదం, స్వామివారి శేషవస్త్రాలు అందజేస్తాం. ఇట్టి సదుపాయం దాతలకు జీవితకాలం ఉంటుంది.

# రామాయణపై ఆసక్తికర విషయాలు

### జటాయువు ప్రవేశంలో మొదటి భాగం ముగింపు

ముంబై, ఆగస్ట్ 30: రెండు భాగాలుగా, 4వేల కోట్ల భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న రామయణపై ఆసక్తికర వార్తలు వస్తున్నాయి. రెండు భాగాలుగా రానున్న ఈ చిత్రాన్ని సుమారు రూ.4000 కోట్లతో రూపొందించనున్నారు. ప్రపంచమంతా ఈ ఇతిహాసాన్ని చూడాలన్న లక్ష్యంతోనే భారీ స్థాయిలో రూపొందిస్తున్నాం. హాలీవుడ్ చిత్రాలకు అయ్యే ఖర్చు కంటే ఇది తక్కువే అని నేను భావిస్తున్నాను. తరాలు మారినా, యుగాలు మారినా రామాయణం ఎప్పటికీ గొప్ప ఇతిహాసమే అని నిర్మాత నమిత్ మల్హోత్ర చెబుతున్నారు. ఇకపోతే ఏదైనా సినిమాను, కథను రెండు భాగాలు చెప్పాల్సి వచ్చినప్పుడు మొదటి భాగం ఎక్కడ ముగిస్తారన్నది చాలా ముఖ్యం 'బాహుబలిని కట్టప్ప ఎందుకు చంపాడు' అన్న ప్రశ్న 'బాహుబలి' విజయంలో కీలక పాత్ర పోషించింది. ఇప్పుడు అందరికీ తెలిసిన ఇతిహాస గాథను బాలీవుడ్‌లో 'రామాయణ'గా తీర్చిదిద్దుతున్న సంగతి తెలిసిందే. రెండు భాగాలుగా రానున్న ఈ మూవీ ఫస్ట్ పార్ట్ వచ్చే ఏడాది దీపావళి కానుకగా విడుదల కానుంది. మరి ఈ భాగం ఏ సన్నివేశంతో ముగిస్తారన్న ఆసక్తి అందరిలోనూ నెలకొంది. దానిపైనే చిత్ర బృందం స్పష్టత ఇచ్చింది. రాముడికి సీత జాడ గురించి 'జటాయువు' ఇచ్చే సందేశంతో ఫస్ట్ పార్ట్‌ను ముగిస్తారట. 'రామాయణ మొదటి భాగం జటాయువు మరణంతో ముగుస్తుంది. జటాయువుకు అమితాబ్ బచ్చన్ వాయిస్ ఓవర్ ఇస్తారు. ఈ సన్నివేశంతో సీతాదేవిని ఎవరు అపహరించారో రాముడికి తెలుస్తుంది. అసలు యుద్ధం పార్ట్-2లో ఉంటుందని చిత్ర బృందం తెలిపింది. ఈ చిత్రంలో రావణాసురుడి పాత్రను కన్నడస్టార్ యశ్ పోషిస్తున్న సంగతి తెలిసిందే. రావణుడి క్రూరత్వం, దయ, కనికరంలేని రాక్షస రాజుగా ఈ పాత్రను పూర్తిగా ఆవిష్కరిస్తారట. అందుకోసం ప్రత్యేకంగా కొన్ని సన్నివేశాలను డిజైన్ చేసున్నారు. అసలు రావణబ్రహ్మ నేపథ్యాన్ని ఒళ్లు గగురుపొడిచేలా తెరపై ఆవిష్కరించనున్నారు. ఈ విషయాన్ని రామాయణ టీ-మ్ స్వయంగా పంచుకుంది. దాదాపు రూ.4 వేల కోట్లతో తెరకెక్కుతున్న 'రామాయణ'కు నితీశ్ తివారి దర్శకత్వం వహిస్తున్న సంగతి తెలిసిందే. రాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్ (శశిస ఔశుస), సీతగా సాయి పల్లవి నటిస్తున్నారు. తొలిభాగం 2026 దీపావళికి, రెండోభాగం 2027 దీపావళికి రానున్నాయి.

